నమస్తే తెలంగాణ

# వికారాబాద్

I | హైదరాబాద్, సోమవారం 1 జూలై 2024 | VIKARABAD


## పదేండ్లు కరెంట్ సమస్యే లేదు..



కేసీఆర్ పదేండ్ల పాలనలో కరెంట్ సమస్య అంటే ఏమిటో తెలియదు. 24 గంటల పాటు నిరంతరంగా సరఫరా అయ్యింది. కానీ.. ఏడు నెలల కిందట అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో కరెంట్ ఎప్పుడు వస్తుందో.. ఎప్పుడు పోతుందో తెలియని పరిస్థితి నెలకొన్నది. అప్రకటిత కోతలతో రైతులు, ప్రజలు, వ్యాపారు లు ఇబ్బంది పడుతున్నారు. పొలాలు సరిగ్గా పారడంలేదు.



అన్నదాతల అభ్యున్నతి కి కృషి చేసిన కేసీఆర్‌ను కాంగ్రెస్ పాలకులు బద్నాం చేయడం సరికాదు. కేసీఆర్ హయాంలో వ్యవసాయం పండుగలా సాగింది.

– మహేందర్, దేవునిఎర్రవల్లి గ్రామం, చేవెళ్ల



మంచాల తహసీల్దార్ కార్యాలయం



# ఎన్కటి రోజులొచ్చాయి

కాంగ్రెస్ పాలనలో కరెంట్ కష్టాలు

ఎడాపెడా కోతలపై ప్రజల ఆగ్రహం

ఎకరా పొలానికి కూడా నీరు పారని వైనం

రేవంత్ సర్కారుపై రైతన్న కన్నెర్ర

కేసీఆర్ హయాంలోనే నాణ్యమైన కరెంట్

తెలంగాణ ఏర్పడ్డాక కేసీఆర్ హయాంలో కరెంట్ కాంతులు ప్రసరిస్తే.. కాంగ్రెస్ పాలనలో 'కట్'కట మొదలైనది. ఎడాపెడా కోతలపై ప్రజలు, వ్యాపారులు, రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఏ పని సక్రమంగా చేయలేకపోతున్నామని, కరెంట్ ఉంటేనే అన్ని పనులు జరుగుతాయని పేర్కొంటున్నారు. ప్రస్తుతం సరఫరా అయ్యే కరెంట్‌తో బోరు మోటర్ ద్వారా ఎకరా పొలం కూడా పారడం లేదని కర్షకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాంగ్రెస్ సర్కారు అధికారంలోకి వచ్చిన ఏడు నెలల కాలంలోనే మళ్లీ పాత రోజులు గుర్తుకొస్తున్నాయి. ఎక్కడ చూసినా కరెంట్ కోతల మాటలే వినిపిస్తున్నాయి. చిన్న వానకు కూడా కరెంట్ పోతున్నది. నాడు నిరంతర వెలుగులు ఉంటే..నేడు ఆగమాగం అవుతు న్నామంటూ ప్రభుత్వంపై ప్రజలు మండిపడుతున్నారు. ఈ కాంగ్రెస్ సర్కార్ మాకు వద్దు బాబోయ్ అంటున్నారు.

- న్యూస్ నెట్‌వర్క్, నమస్తే తెలంగాణ

### కరెంట్ ఎప్పుడు పోతుందో తెలుస్తలేదు..



స్వరాష్ట్రం వచ్చిన నాటి నుంచి పదేండ్ల వరకు తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ రెప్ప పాటు కరెంట్ పోకుండా చర్యలు తీసుకుని రైతులకు అండగా నిలిచారు. 24 గంటలపాటు నాణ్యమైన విద్యుత్తును వ్యవసాయానికి, ఇండ్లకు సరఫరా చేశారు. కానీ.. ప్రభుత్వం మారి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో కరెంట్ ఎప్పుడు వస్తుందో.. ఎప్పుడు పోతుందో తెలియని పరిస్థితి నెలకొన్నది. దీంతో రైతులు, ప్రజలు, వ్యాపారులు, ఇతర వర్గాల వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

– సీహెచ్ రాము, అంతారం గ్రామం, చేవెళ్ల

### రైతుల గోస తీర్చింది కేసీఆర్ సారే..



కేసీఆర్ ప్రభుత్వ పాలనలో విద్యుత్తు సరఫరా నిరంతరంగా ఉండేది. ఇప్పుడు కరెంట్ ఎప్పుడు వస్తుందో.. ఎప్పుడు పోతుందో తెలియని పరిస్థితి నెలకొన్నది. కేసీఆర్ వచ్చిన తర్వాత 24 గంటల కరెంటిచ్చి చెరువులు, కెనాళ్లకు నీటిని వదిలి బావుల్లో పుష్కలంగా నీరు ఉండేలా చేశారు. రైతులం ఎప్పుడు తీరిక దొరికితే అప్పు డు పోయి పంటలకు నీరు పెట్టుకునేది. కానీ, ఈ కాంగ్రెస్ పాలనలో విద్యుత్తు సరఫరా సక్రమంగా లేక ఇబ్బంది పడుతున్నాం.

– ఇమ్రాన్, సింగప్పగూడ గ్రామం, చేవెళ్ల మండలం

### ఇష్టం వచ్చినట్లు కోతలు ..



ప్రతిరోజూ ఇష్టం వచ్చినట్లు విద్యుత్తు సరఫరాలో కోతలు విధిస్తున్నారు. సరఫరాలో కోతల్లేవని పాలకులు చెబుతున్నా మాటల్లో నిజం లేదు. కరెంట్ విషయంలో కేసీఆర్‌ను మరచిపోలేం. ఆయన అధికారంలో ఉన్నప్పుడు విద్యుత్తు సమస్యలు అంటే ఏమిటో తెలియకుండా చర్యలు తీసుకున్నారు. నిరంతర విద్యుత్తు సరఫరా తో ఉదయం నుంచి సాయంత్రం వరకు రైతులు పొలం పనులు చేసుకునే వారు. దీంతో వ్యవసాయం పండుగలా సాగింది.

– మంగలి వెంకటేశ్, ఊరేళ్ల గ్రామం, చేవెళ్ల మండలం

## తహసీల్దార్ ఆఫీస్‌లో నకిలీ దందా..

- గుర్తించిన మంచాల తహసీల్దార్ కేవీవీ ప్రసాద్‌రావు
- నకిలీ సర్టిఫికెట్లు సృష్టించిన ఆపరేటర్, మీ సేవ నిర్వాహకుడిపై కేసు నమోదు
- గత కొంతకాలంగా అనర్హులకు జారీ
- పరారీలో నిందితులు

మంచాల, జూన్ 30 : మంచాల తహసీల్దార్ కార్యాలయంలో అవుట్ సోర్సింగ్ విధానంలో కంప్యూటర్ ఆపరేటర్‌గా పని చేస్తున్న సురేశ్, హైదరాబాద్ నగరంలోని మీసేవ నిర్వాహకుడు, మరో ఇద్దరితో కలిసి నకిలీ సర్టిఫికెట్లను సృష్టిస్తూ మంచాల తహసీల్దార్‌కు అడ్డంగా దొరికాడు. అనర్హులకు హయ్యర్ ఎడ్యుకేషన్ కోసం క్యాస్ట్, ఇన్‌కం సర్టిఫికెట్లను ఇస్తూ డబ్బులను గుంజుతున్న విషయం అధికారులకు తెలియడంతో గుట్టుచప్పుడు కాకుండా సెలవుపెట్టి పరారయ్యాడు. మంచాల తహసీల్దార్ కార్యాలయంలో గతేడాది కిందే అవుట్ సోర్సింగ్ ఉద్యోగిగా సురేశ్ చేరాడు. మొదటి నుంచి తోటి ఉద్యోగులతో దురుసుగా ఉండేవాడు. అయితే ధనార్జనే ధ్యేయంగా ఎంచుకున్న అతడు నగరంలోని వనస్థలిపురంలో ఉన్న మీసేవ నిర్వాహకుడైన రాజుతో పాటు మరో ఇద్దరితో కుమ్మక్కయ్యాడు. స్థానికేతరులకు క్యాస్ట్, ఇన్‌కం సర్టిఫికెట్లను జారీ చేస్తూ అక్రమార్జనకు పాల్పడ్డాడు. ఇందు కోసం వారినుంచి ఒక్కో సర్టిఫికెట్‌కు రూ.వెయ్యి నుంచి రూ.5వేల వరకు వసూలు చేస్తున్నట్లు తెలిసింది. ఈ దందా మిగతా అధికారులకు తెలియకుండా సురేశ్ ఎంతో గోప్యంగా వ్యవహరించాడు. అయితే సురేశ్ సెలవు పెట్టి వారం రోజులుగా విధులకు హాజరుకావడం లేదు. దీంతో అనుమానం వచ్చిన తహసీల్దార్ కేవీవీ ప్రసాద్‌రావు గత 10 రోజుల నుంచి క్యాస్ట్, ఇన్‌కం సర్టిఫికెట్లు ఎంతమందికి జారీ చేసిన విషయాన్ని పరిశీలించగా, అందులో 57 మందికి వనస్థలిపురం మీసేవ సెంటర్ నుంచి ఒకే ఫోన్ నంబర్‌పై జారీ అయినట్లు తహసీల్దార్‌కు తెలిసింది. దీనిపై ఆరా తీయగా ఈ బాగోతం మొత్తం బయటపడింది. వెంటనే కంప్యూటర్ ఆపరేటర్ సురేశ్‌తో పాటు మీసేవ నిర్వాహకుడిపై రెండు రోజుల క్రితమే తహసీల్దార్ మంచాల పోలీసులకు ఫిర్యాదు చేశారు.



మంచాల తహసీల్దార్ కార్యాలయంలోని కంప్యూటర్ ఆపరేటర్ సురేశ్

### కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లా..



మంచాల తహసీల్దార్ కార్యాలయంలో పని చేస్తున్న అవుట్‌సోర్సింగ్ అయిన సురేశ్ స్థానికేతరులైన 57మందికి నకిలీ సర్టిఫికెట్లు జారీ చేశాడు. అతడిపై కఠిన చర్యలు తీసుకోవాలి. దీనిపై మంచాల పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పాటు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లా. సురేశ్ సెలవు పెట్టి వారం రోజులుగా ఆఫీసుకు రావడం లేదు. నకిలీ సర్టిఫికెట్లు అవసరమున్నవారు కార్యాలయానికి వస్తుండడంతో అనుమానం వచ్చి పరిశీలించగా ఈ తతంగం బయటపడింది. మండలంలో క్యాస్ట్, ఇన్‌కం సర్టిఫికెట్లు జారీ చేసే విషయంలో ఆర్ఐతో పాటు ఇతర అధికారులు ధ్రువీకరించిన తరువాతే వారికి సర్టిఫికెట్లు జారీ చేస్తాం.. కానీ కంప్యూటర్ ఆపరేటర్ సురేశ్ అన్నీ తానై ఈ తతంగాన్ని నడిపించాడు. ఈ వ్యవహారంలో పాత్రధారులైన వనస్థలిపురంలోని మరో ముగ్గురిపై కూడా కఠిన చర్యలు తీసుకోవాలని మంచాల పోలీసులకు ఫిర్యాదు చేశా.

– కేవీవీ ప్రసాద్‌రావు, మంచాల తహసీల్దార్

## ఇవేం బదిలీలు!

8 రోజుల్లోనే ట్రాన్స్‌ఫర్లు పూర్తి చేయడంపై విస్మయం

2వేల మందికి బదిలీలు..700 మందికి ఉద్యోగోన్నతి

ఇప్పటికే 111 మందికి హెచ్‌ఎంలుగా ఉద్యోగోన్నతి

షెడ్యూల్ తేదీని పొడిగించాలని కోరుతున్న ఉపాధ్యాయులు



రంగారెడ్డి, జూన్ 30 (నమస్తే తెలంగాణ): ఏండ్ల తరబడిగా నిలిచిపోయిన ఉపా ధ్యాయుల బదిలీల్లో కదలిక రావడంతో రంగారెడ్డి జిల్లాలోని ఉపాధ్యాయుల్లో సంతోషం వ్యక్తమవుతుండగా.. బదిలీల ప్రక్రియ నిర్వహణపై మాత్రం వారిలో అసంతృప్తి వ్యక్తమవుతున్నది. కేవలం 8రోజుల్లోనే బదిలీల ప్రక్రియను పూర్తి చేసేలా షెడ్యూల్‌ను విడుదల చేయడంపై విస్మయం వ్యక్తం చేస్తున్నారు. వెబ్‌ఆప్షన్, ఎడిట్ ఆప్షన్, బదిలీ పోస్టింగ్‌లకు వ్యవధి ఇవ్వకుండా హడావిడిగా నిర్వహించనుండడంపై టీచర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఖాళీల వివరాలు, సీనియారిటీ వివరాలు ఎప్పటికప్పుడు మారుతుండడం.. కొన్ని పోస్టులను చూపించక బ్లాక్‌లో పెడుతున్నా రన్న ఆరోపణల నేపథ్యంలో పారదర్శకంగా నిర్వహించాలన్న డిమాండ్ ఉపాధ్యా యుల నుంచి వినిపిస్తున్నది. అలాగే.. షెడ్యూల్ తేదీని పొడిగించాలని ఉపా ధ్యాయులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

### ఏండ్ల తరబడి ఎదురుచూపులకు తెర..

2018లో చివరిసారిగా ప్రభుత్వం బదిలీల ప్రక్రియను చేపట్టింది. ఆ తర్వాత కోర్టు కేసుల నేపథ్యంలో బదిలీలు ముందుకు సాగలేదు. తాజాగా హైకోర్టు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో కాలయాపన చేయకుండా విద్యాశాఖ వెనువెంటనే బదిలీల ప్రక్రియను మొదలుపెట్టింది. జిల్లాలో ఎనిమిదేండ్లుగా స్థానచలనానికి నోచుకోని ఉపాధ్యాయు లు చాలా మందే ఉన్నారు. 2018లో చేపట్టిన బదిలీల సందర్భంగా ఎనిమిదేండ్ల కటాఫ్ పూర్తికాక చాలామంది 2010, 2011 సంవత్సరం నుంచి పనిచేస్తున్న చాలా మంది టీచర్లు బదిలీకి నోచుకోలేకపోయారు. దీంతో వారంతా గత 13 ఏండ్లుగా ఒకేచోట విధులు నిర్వర్తిస్తున్నారు. ఇక భార్యాభర్తలు కూడా వేర్వేరు ప్రాంతాల్లో పనిచేస్తున్నారు. వీరంతా బదిలీల కోసం ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం తాజాగా.. షెడ్యూల్ విడుదల చేయడంతో ఏండ్ల నాటి వారి నిరీక్షణకు తెరపడనున్నది.

### 8 రోజుల్లో బదిలీలు ఎలా..

జిల్లాలో పోస్టులు లేకున్నా ఇతర జిల్లాలకు చెందిన టీచర్లు రంగారెడ్డికి బదిలీపై వచ్చి తిష్ట వేశారు. దీనివల్ల బదిలీలు, ఉద్యోగోన్నతుల్లో స్థానిక ఉపాధ్యాయులకు అన్యాయం జరుగుతుండడంతో వారిలో కొంతమంది కోర్టును ఆశ్రయించారు. దీనివల్ల ప్రభు త్వం ప్రతిసారీ రాష్ట్రవ్యాప్తంగా షెడ్యూల్ విడుదల చేసినా జిల్లాలో మాత్రం బదిలీల ప్రక్రియ నిలిచిపోతుండడం పరిపాటిగా మారుతున్నది. కాంగ్రెస్ ప్రభుత్వం సైతం గత నెల 8న షెడ్యూల్‌ను విడుదల చేయగా..రంగారెడ్డి జిల్లాలో మాత్రం ఆ ప్రక్రియ నిలిచిపోయింది. అయితే ప్రభుత్వం తాత్కాలికంగా స్టేను వెకెట్ చేయించి రెండు రోజుల క్రితం హడావిడిగా షెడ్యూల్‌ను విడుదల చేసింది. ఇతర జిల్లాల్లో షెడ్యూల్ 20 రోజుల వరకు ఉండగా.. రంగారెడ్డి జిల్లాలో మాత్రం 8 రోజులే ఉండడంతో ఉపాధ్యాయుల్లో అసంతృప్తి వ్యక్తమవుతున్నది. 29న సీనియారిటీ జాబితాకు సంబంధించిన అభ్యంతరాల స్వీకరణకు అవకాశం ఇవ్వగా.. 30న ఫైనల్ సీనియర్ జాబితాను ప్రదర్శించడంతోపాటు వెబ్ ఆప్షన్లు, ఎడిట్ చేసుకునే చాన్స్ ఇచ్చారు. అయితే ఒకే రోజు ఆప్షన్‌కు, ఎడిట్‌కు అవకాశం ఇచ్చి అదే రోజు రాత్రి పోస్టింగ్‌లు ఇస్తుండడంతో ఉపాధ్యాయులు ఆందోళన చెందుతున్నారు. ఖాళీల వివరాలు, సీని యారిటీ లిస్ట్ క్షణక్షణానికి మారుతుండడం.. కొన్ని ఖాళీలను చూపించకుండా బ్లాక్‌లో పెట్టడం వల్ల అయోమయానికి గురికావాల్సి వస్తున్నదని ఉపాధ్యాయులు వాపోతున్నారు. బదిలీల కోసం ఆప్షన్ పెట్టుకోవాల్సిన ఎస్జీటీలు 2000 మంది ఉండగా.. వారంతా ఒకే రోజున ఆప్షన్ ఎలా? పెట్టు కోగలుగుతారని టీచర్లు ప్రశ్ని స్తున్నారు. ఏ చిన్న తప్పిదం జరిగినా ఎనిమిదేండ్లపాటు ఇబ్బందులు పడాల్సి వస్తుందని పేర్కొంటున్నారు.

### 111 హెచ్‌ఎంల ఉద్యోగోన్నతులు పూర్తి..

జిల్లాలో బదిలీల కోసం 2000 మంది, పదోన్నతుల కోసం మరో 700 మంది ఉపాధ్యాయులు ఎదురు చూస్తున్నారు. ఇప్పటికే హెచ్‌ఎంల ఉద్యోగోన్నతులకు సంబంధించిన ప్రక్రియను అధికారులు పూర్తి చేశారు. జిల్లావ్యాప్తంగా 111 మంది స్కూల్ అసిస్టెంట్లకు హెచ్‌ఎంలుగా ఉద్యోగోన్నతి కల్పించారు. అయితే అనుకున్న పాఠశాల రాకపోవడంతో ఐదుగురు ఉపాధ్యాయులు ప్రమోషన్‌కు దూరంగా ఉన్నారు. రూ రల్ ప్రాంతాల్లో పనిచేసే ఉపాధ్యాయులకు ఏడాదికి 3 పాయింట్లుండగా, పట్టణ ప్రాంతాల్లో పనిచేసే వారికి ఏడాదికి 2 పాయింట్లు కలుస్తాయి. కానీ..ప్రివరెన్షియల్ కేటగిరీకి మాత్రం వీరందరికన్నా ముందు ప్రాధాన్యం ఇవ్వడం జరుగుతుంది. ఇదే అదనుగా భావించిన కొందరు అడ్డదారుల్లో బెస్ట్ స్కూళ్లలో పోస్టింగ్ పొందేందుకు చర్యలను ముమ్మరం చేశారన్న టాక్ వినిపిస్తున్నది. అలాగే..రీలింక్విష్‌మెంట్ విధా నం అమలుపైనా ఉపాధ్యాయులు అనేక సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. తుది తీర్పు వచ్చేవరకు జిల్లాలో కోర్టుకెళ్లిన 40 పోస్టులను ఖాళీగా ఉంచి బదిలీలు, పదోన్నతుల ప్రక్రియను చేపట్టాలని హైకోర్టు స్పష్టం చేసింది.

### పారదర్శకంగా బదిలీల ప్రక్రియ



జిల్లా విద్యాశాఖ వద్ద పూర్తి సమాచారం ఉన్నది. అందువల్ల 8 రోజుల షెడ్యూల్ తో ఎటువంటి ఇబ్బందులు ఉండవు. బదిలీలు, ఉద్యోగోన్నతుల ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించేలా చర్యలు తీసుకుంటున్నాం. కోర్టు ఆదేశాలకు అనుగుణంగా ప్రక్రియను చేపడుతున్నాం. ప్రివరెన్షియల్ కేటగిరీలో అక్రమాలపై ఎటువంటి ఫిర్యాదులు రాలేదు. అక్రమ పద్ధతిలో ఎవరైనా బదిలీలు పొందినట్లు మా దృష్టికి తెస్తే..వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.

–సుశీందర్‌రావు, రంగారెడ్డి డీఈవో

## ఎన్నికల ఖర్చు వివరాలను సమర్పించాలి

### చేవెళ్ల లోక్ సభ ఎన్నికల వ్యయ పరిశీలకులు సెంథిల్ కుమార్, రాజీవ్ చాబ్రా

రంగారెడ్డి, జూన్ 30 (నమస్తే తెలంగాణ) : ఎన్నికల ఖర్చు వివరాలను గడువు లోపు సమర్పించాలని చేవెళ్ల లోక్ సభ నియోజకవర్గ వ్యయ పరిశీలకులు సెంథిల్ కుమార్, రాజీవ్ చాబ్రా అన్నారు. ఇటీవల జరిగిన లోక్ సభ ఎన్నికల్లో చేవెళ్ల లోక్ సభ నియోజకవర్గం నుంచి పోటీ చేసిన అభ్యర్థులందరూ ఎన్నికల సందర్భంగా చేసిన ఖర్చు మొత్తాలను సరి చూసుకుని, అవసరమైన వివరాలను నిర్ణీత గడువులోపు సమర్పించాలని వ్యయ పరిశీలకులు సూచించారు. ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులు చేసిన ఖర్చుల వివరాలను సరిపోల్చుకునేందుకు వీలుగా సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో ఆదివారం రికన్సిలేషన్ నిర్వహించారు. ఎన్నికల వ్యయ పరిశీలకులు సెంథిల్ కుమార్, రాజీవ్ చాబ్రాలు అభ్యర్థుల ఎన్నికల ఖర్చుల వివరాల వ్యత్యాసాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యయ పరిశీలకులు మాట్లాడుతూ ఎన్నికల్లో పోటీ చేసిన ప్రతి అభ్యర్థీ ఎన్నికల ఖర్చుకు సంబంధించి రోజు వారీ ఖాతా రిజిస్టర్, నగదు లావాదేవీల రిజిస్టర్, బ్యాంక్ రిజిస్టర్, స్టేట్ మెంట్, షెడ్యూల్‌లో 1 నుంచి 11 వరకు గల ఎన్నికల ఖర్చుల వివరాలను సరి చూసుకోవాలన్నారు. సరైన క్రమసంఖ్యతో కూడిన అన్ని బిల్లులు, వోచర్లు, ఒరిజినల్ అఫిడవిట్, స్వీయ ధ్రువీకరణతో కూడిన బ్యాంకు స్టేట్ మెంట్ తదితర వాటిని ఎన్నికల ఫలితాలు ప్రకటించబడిన రోజు నుంచి 30 రోజుల్లోపు సమర్పించాల్సి ఉంటుందన్నారు. గడువు ముగియనున్న నేపథ్యంలో రికన్సిలేషన్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అభ్యర్థులు, వారి ఏజెంట్లకు ఏఈవోలు మార్గనిర్దేశం చేస్తున్నారని తెలిపారు. వివరాలను సకాలంలో సమర్పించని పక్షంలో నోటీసులు జారీ చేస్తామన్నారు. సమావేశంలో జిల్లా ఎన్నికల వ్యయ కమిటీ నోడల్ అధికారి సురేశ్‌మోహన్, చేవెళ్ల నియోజకవర్గం నుంచి పోటీ చేసిన అభ్యర్థుల ఏజెంట్లు, ఏఈవోలు పాల్గొన్నారు.

## సాగు భూమికే రైతుభరోసా ఇవ్వాలి

బషీరాబాద్, జూన్ 30 : సాగు భూములకే రైతు భరోసా పథకాన్ని వర్తింపజేయాలని మెజార్టీ రైతులు అభిప్రాయపడుతున్నారని వికారాబాద్ జిల్లా వ్యవసాయాధికారి గోపాల్, నవంద్గి సహకార సంఘం చైర్మన్ అల్లాపూరం వెంకట్రాంరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని రైతు వేదికలో రైతుభరోసా పథకం అమలుపై మండల రైతుల నుంచి అభిప్రాయాలను సేకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆదాయ పన్ను కట్టేవారికి రైతుభరోసా ఇవ్వొద్దని, లోన్ కోసం ఆదాయ పన్ను ఫైల్ చేసిన రైతులకు రైతుభరోసా ఇవ్వాలని రైతులు పేర్కొన్నట్లు వారు తెలిపారు. వ్యవసాయ భూమి ఎన్ని ఎకరాలు ఉన్నప్పటికీ రైతుభరోసా చెల్లించాలని కొంత మంది రైతులు అభిప్రాయపడ్డారన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, సాగుకు యోగ్యం కాని భూములు, వెంచర్లు, ఫామ్‌హౌస్‌లు, కౌలు రైతులకు ఇవ్వొద్దని పేర్కొంటున్నారన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ శ్రీనివాస్ రెడ్డి, వైస్ చైర్మన్ అజయ్‌ప్రసాద్, సభ్యులు అశోక్‌గౌతమ్, శ్రీనివాస్ రెడ్డి, ఎక్మాయి గోపాల్‌రెడ్డి, హన్మంత్‌రెడ్డి, నవీన్‌రెడ్డి, గోపాల్, మండల వ్యవసాయాధికారి సూర్యప్రకాశ్, సీఈవో బందెప్ప తదితరులు పాల్గొన్నారు.



డీఏవో గోపాల్‌ను సన్మానిస్తున్న చైర్మన్ వెంకట్రాంరెడ్డి